దేశ న్యాయవ్యవస్థ నత్తనడకకు బాధ్యులెవరు?

సకాలంలో వైద్యం అందకపోతే రోగి మరణిస్తాడు. అయితే, సత్వర న్యాయం లభించనప్పుడు మొత్తం సమాజం మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. ప్రధానమంత్రి, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితోసహా అనేక మంది ప్రముఖులు న్యాయస్థానాల్లో కేసులు పేరుకుపోవడంపై పలు సందర్భాల్లో ఆందోళన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టులో 47,000 కేసులు.. హైకోర్టులలో 37, 64,565 కేసులు.. అధీన న్యాయస్థానాల్లో 2.75 కోట్ల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖకు అను బంధంగా ఉన్న పార్లమెంటరీ స్థాయీసంఘం తన నివేదికలో వెల్లడించింది. 50 ఏళ్లపాటు కొనసాగిన ఒక భూ వివాద కేసును పరిష్కరిస్తూ సుప్రీంకోర్టు.. ''మితిమీరిన జాప్యం వల్ల ప్రజల్లో న్యాయవ్యవస్థపై విశ్వాసం సడలుతోంది. ఈ పరిణామం చాలా ప్రమాదకరం'' అని వ్యాఖ్యానించింది. దీనికి బాధ్యులెవరు? పాక్షికంగా ప్రభుత్వం; కొంతమేరకు న్యాయ వ్యవస్థ.

దేశవ్యాప్తంగా 14,000 న్యాయస్థానాలు.. 12,500 న్యాయ మూర్తుల ద్వారా 4 కోట్ల కేసులను పరిష్కరిస్తున్నాయి. అంటే... ప్రతి న్యాయ మూర్తి సగటున 4,000 కేసులను పరిష్కరించాలి. ఇది మితిమీరిన భారమని మన ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి కె.జి.బాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు. న్యాయ వ్యవస్థ పనితీరులో జాప్యానికి ప్రధాన కారణం.. తగినంత సిబ్బంది లేకపోవడమే. అమెరికాలో ప్రతి పది లక్షల మంది ప్రజలకు 104 మంది న్యాయ మూర్తులుంటే.. కెనడాలో 75 మంది న్యాయమూర్తులు ఉన్నారు. ఈ సంఖ్య భారత్‌లో 15మాత్రమే. దీన్ని కనీసం 50 మందికి పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు సూచించింది. రోజు రోజుకు సివిల్ కేసులు పెరిగిపోతు న్నాయని, అపరిష్కృత కేసుల సంఖ్య మరింత పెరుగుతోందని; అదనపు న్యాయమూర్తుల తక్షణ నియామకం ఎంతైనా అవసరమని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల వార్షిక సమావేశంలో అభిప్రాయపడింది.

న్యాయవ్యవస్థకు ప్రభుత్వం పెట్టే ఖర్చు కేవలం 0.078 శాతం. పంచవర్ష ప్రణాళికల్లో... ఆర్థిక సంఘం సిఫార్సుల్లో.. న్యాయవ్యవస్థ ఆధునికీకరణకు ఎలాంటి కేటాయింపులు జరగలేదు. దీంతోపాటు కేంద్ర నుంచి ధన సహాయం పొంద డానికి రాష్ట్ర ప్రభుత్వాలు సమానంగా నిధులను కేటాయించాలనే నిబంధన ఉంది. ఢిల్లీ ప్రభుత్వం మినహా... అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఒక శాతం కంటే తక్కువే ఖర్చు చేస్తున్నాయి. న్యాయ వ్యవస్థ ఖర్చు, ప్రణాళిక నిధుల నుంచి జరగాలని.. న్యాయ వ్యవస్థలకు ఫీజుల ద్వారా లభించే ఆదాయాన్ని ప్రత్యేక ఖాతాలో జమ చేయాలని.. న్యాయస్థానాలు ఆర్థిక స్వాధీనత కలిగుండాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల సమావేశం అభిప్రాయపడింది. న్యాయవ్యవస్థ సంస్కరణల (2008)పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.జి.బాలకృష్ణన్ ప్రసంగిస్తూ... న్యాయ వ్యవస్థ పనితీరులో జాప్యానికి ప్రధాన కారణం ప్రభుత్వమేనన్నారు. ఎక్కువ శాతం కేసులు ప్రభుత్వానికి సంబంధించిన వేనని... దీనికి కారణం..



పాలనలో అసమర్థత, భాధ్యతారాహిత్య ధోరణి అని విమర్శించారు. రెవెన్యూశాఖ అసమర్థత, అవినీతి.. న్యాయస్థానాల్లో కేసులు పెరగడానికి ప్రధాన కారణం. రెండోది.. రుణాలిచ్చే సంస్థలు విపరీతమైన వడ్డీని వసూలుచేస్తూ సకాలంలో చెల్లించని వారిపై.. నెగోషియబల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం కింద కేసులు పెట్టడం జరుగుతోంది. దీంతో న్యాయ స్థానాలు బకాయిలు వసూలు చేసే వ్యవస్థలుగా మారాయి.

మూడోది.. ఇన్సూరెన్సు కంపెనీలు పాలసీదారులకు సక్రమంగా పరిహారం చెల్లించకుండా అవకతవకలకు పాల్పడుతుంటాయి. ఇక్కడ న్యాయస్థానాలను ఆశ్రయించడం తప్ప బాధితులకు గత్యంతరం లేదు. నాల్గోది... భూసేకరణకు సంబంధించిన కేసులు విపరీతంగా పెరిగిపోవడం. సంబంధిత అధికారులు న్యాయబద్ధంగా నిర్వాసితులకు నష్టపరిహారం యివ్వకపోవడం.. బాధితులు కోర్టులకెక్కడం పరిపాటి. అయిదోది... అసమర్థ, అవినీతి పోలీసు యంత్రాంగం.. క్రిమినల్ కేసుల విషయంలో సరైన సాక్ష్యాధారాలు సేకరించకపోవడం. దాంతో కేసులు తరచుగా వాయిదాపడటం, పై న్యాయస్థానాలకు అప్పీళ్లకు వెళ్లడం జరుగుతోంది. ఆరోది... దేశంలో చట్టాల అమలుకు అయ్యే ఖర్చుకు బడ్జెట్‌లో కేటాయింపు జరగదు. కొత్త చట్టం అమలులో ఎదురయ్యే న్యాయపరమైన వివాదాల పరిష్కారానికి అదనపు కోర్టులు, సిబ్బంది అవసరం.

అపరిష్కృతంగా ఉన్న కోట్లాది కేసులను విచారించడానికి సమయంలేక సతమతమవుతున్న కోర్టులకు అదనపు కేసులు మరింత భారం. ట్రిబ్యునల్ కార్యాలయానికి వసతి సౌకర్యం లేకపోవడంతో.. న్యాయమూర్తి కారులో కూర్చొని కేసులు విచారించారని ఇటీవల ఢిల్లీకి చెందిన ఒక వార్తాపత్రికలో ప్రచురితమైంది. ఏడోది... న్యాయస్థానాలకు, న్యాయమూర్తుల నివాసాలకు సరైన వసతి, తగిన సిబ్బందిలేక.. న్యాయ ప్రక్రియ మరింత జాప్యానికి గురవుతోంది. ఎనిమిదోది... అఖిల భారత న్యాయమూర్తుల సంఘం పలు దఫాలుగా తమకు కనీస వసతులు కల్పించాలని సుప్రీంకోర్టులో కేసువేసింది. న్యాయశాస్త్ర పుస్తకాలు కొనుక్కోవడానికి న్యాయమూర్తులకు వనరులు లేక పోవడం దురదృష్టకరం. సగం మంది న్యాయమూర్తులకు వసతి గృహాలు లేవు. ఆయా అభివృద్ధి కార్యక్రమాల పేరిట ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చుపెడుతున్నా న్యాయస్థానాలకు కనీస వసతులు కల్పించడానికి, ఉద్యోగులకు న్యాయబద్ధ వేతనాలు ఇవ్వడానికి వనరులు లేవని చేతులెత్తేస్తోంది. లా కమిషన్ అభిప్రాయపడినట్లు... ''ప్రభుత్వ కేసులు పెరగడానికి కారణం.. ప్రభుత్వ బాధ్యతా రాహిత్య

ధోరణి. ఉద్యోగస్తుల ప్రతీకార స్వభావం, కక్షిదారుల (litigants) నుంచి లంచం ఆశించడం, ఉద్యోగుల అహంకార ధోరణి''. ప్రధానమంత్రి పేర్కొన్నట్లు...''ఎక్కువ సందర్భాల్లో ప్రభుత్వం ఉన్నత న్యాయ స్థానాలకు అప్పీలు చేయాల్సిన అవసరమే లేదు''. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య తలెత్తే పలు చట్టపరమైన వివాదాలు కోర్టు వెలుపల రాజీ ద్వారా పరిష్కరించుకోవచ్చు. నిర్బంధ మధ్యవర్తిత్వం కూడా ఎంతో ఉపయుక్తం.

హైకోర్టు పర్యవేక్షణలోని లోక్ అదాలత్ పేద ప్రజల వేదికగా ప్రశంసలందుకుంది. ప్రమాదాల కేసులు, భూసేకరణ కేసుల పరిష్కారంలో లోక్‌అదాలత్‌లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. అయితే, ఉభయపక్షాలు లోక్‌అదాలత్ ద్వారా వివాద పరిష్కారానికి అంగీకరించాలి. ఏ ఒక్కరు వ్యతిరేకించినా దీనివల్ల ఫలితముండదు. సోమశిల ప్రాజెక్టు అమలులో తలెత్తిన భూవివాదాల పరిష్కరానికి 2006లో లోక్ అదాలత్ ఏర్పాటైంది.

1985 నుంచి కొనసాగుతున్న రైతుల నష్టపరిహార వివాదం... చివరకు లోక్‌అదాలత్ ద్వారా చాలావరకు పరిష్కారమైంది. విసిగిపోయిన రైతులు విధిలేక తమ కేసులను లోక్‌అదాలత్‌ల పరిధిలోకి తీసుకురావడానికి ఒప్పుకున్నారు. అలాగే ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు (మహబూబ్‌నగర్) భూసేకరణ కేసు... 1989 నుంచి 2005 వరకు కొనసాగింది. 2007లో రైతులకు వెంటనే నష్టపరిహారమివ్వాలని హైకోర్టు ఆదేశించినా... ప్రభుత్వ న్యాయవాది మరికొంత వ్యవధి కోరడం బాధాకరం. అంతమాత్రాన ప్రభుత్వానిదే లోపం అనలేం.

అనేక సందర్భాల్లో ఉన్నత న్యాయస్థానాలు.. దిగువ న్యాయ స్థానాలనుద్దేశించి సరైన ప్రమాణాలు రూపొందించకపోవడం అనవసర అప్పీళ్లకు దారితీస్తోంది. అలాగే బీమా సంస్థలు నష్టపరిహారం చెల్లింపులపై తరచుగా కోర్టులకు వెళ్లడానికి కారణం.. సుప్రీంకోర్టు నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్స్ చట్టం అమలు కోసం జారీచేసిన ఉత్తర్వులు కొన్ని కొత్త వివాదాలకు దారితీయడం. వీటన్నిటికంటే ప్రమాదకరమైంది.. అనవసరంగా కేసులు వాయిదా వేయడం. కేసును క్షుణ్ణంగా పరిశీలించకుండా యాదృచ్ఛికంగా తీర్పులివ్వడం.. అన్యాయానికి గురైన కక్షిదారుడు 'పై న్యాయ స్థానాని'కి అప్పీలు చేసుకోవడం జరిగి, మరింత జాప్యా నికి దారి తీస్తోంది. న్యాయవ్యవస్థ స్వీయ ప్రక్షాళన చేసుకోవాలి. పని గంటలు పెంచుతూ.. సెలవులు తగ్గించుకుంటూ.. అవసరాన్ని బట్టి సాయంకాలంపూట రెండో షిప్టులో పని చేయడం అవసరం. ఆ మేరకు ఇప్పటికే కొన్ని మార్పులు జరిగాయి. మరిన్ని అవసరం!!

ముఖ్యాంశాలు

- దేశంలో న్యాయస్థానాలు 14,000.. న్యాయమూర్తులు 12, 500
- అమెరికాలో ప్రతి పదిలక్షల మంది ప్రజలకు 104 మంది, కెనడాలో 75 మంది, భారత్‌లో 15 మంది న్యాయ మూర్తులున్నారు.
- న్యాయవ్యవస్థ పనితీరులో జాప్యానికి ప్రధాన కారణం ప్రభుత్వమే – సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి కె.జి. బాలకృష్ణన్
- రుణ బకాయిదారులపై కేసులు దాఖలు చేయడానికి ఉపయోగించే చట్టం.. నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ యాక్ట్
- సోమశిల ప్రాజెక్టు భూ వివాదాల పరిష్కారానికి లోక్ అదాలత్ ఏర్పాటైన సంవత్సరం 2006